# జీవితవ



"అబ్బబ్బ. నన్ను చంపకు శైలా! ఆ పుస్తకాలంటే నాకు సహస్రామడల దూరం. మరేదయినా చెప్పు. నిముషాలమీద విజయం సాధిస్తాను."

"అలా అనకండి. జీవితంలో మరేమీ మిమ్మల్ని కోరను. ఇది ఒక్కటే నాకోసం చెయ్యండి. మిమ్మల్ని యేమీ కష్టం చెయ్యమనటం లేదుగా. చక్కగా చదువుకోమంటున్నాను. కావాలంటే నేను సాయం చేస్తాను. నా యీ ఒక్క కోరికా ముద్దుగా చెల్లించండి." శైలజ ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"నన్నలా ప్రాధేయపడకు. సంవత్సరంక్రితం గిరాట్టు కొట్టిన పుస్తకాలు మళ్ళీ తీసుకుని యిప్పుడు చదవాలంటే యెంత కష్టమో నీకు తెలియదు. అయినా యిప్పుడు నేను బి.ఎ. కాకపోతే మటుకు యేం? వచ్చిన లోటు యేమిటి? నువ్వు బి. ఎ. విగా. నాకదిచాలు." శ్రీధర్ భార్యమీద విసుక్కుంటూ అన్నాడు.

"నా పందెం గురించి తెలిస్తే మీరలా మాట్లాడరు" శైలజ తల వంచుకుని అంది.

"ఏమిటా పందెం?" వంగిన శైలజముఖాన్ని తనివిదీరా చూస్తూ అడిగాడు. శైలజ చెప్పటం మొదలుపెట్టింది:

"అన్నయ్యా, నేనూ ఒక రోజున వాదనలో పందెం వేసుకున్నాం. నేను బి. ఎ. జూనియర్ చదువుతుండగా ఒక రోజు రాత్రి పూట అన్నమాట. ఆ రాత్రి మాటలమీద మా యిద్దరికీ స్త్రీకి యెక్కువ పట్టుదలా? పురుషునికి యెక్కువ పట్టుదలా? అనే సమస్య వచ్చింది. స్త్రీలకుపట్టుదల జాస్తి అని అన్నయ్యకు అనేక ఉదాహరణలు చూపించాను. పురుషుడికి పట్టుదల యెక్కువని అన్నయ్య కూడా కొన్ని సంఘటనలు చెప్పాడు. నాన్నగారు, అమ్మగారు వూరికే మా వాదన వింటూ కూర్చున్నారు.

"స్త్రీల హృదయం చాలా సుకుమారంగా ఉంటుంది. వాళ్ళ పట్టువిడుపులలో బిగువు వుండదు. ఎంత కఠిన హృదయంగల స్త్రీ అయినా పట్టుదల యిట్టే సడలిపోతుంది." అన్నాడన్నయ్య.

"స్త్రీలనుగురించి నీకు వాస్తవంగా తెలియదు. నీది కేవలం పుస్తకాలజ్ఞానం. దాన్నాధారం చేసుకుని మాట్లాడబోకు. అవసరమైతే పురుషుడికంటే స్త్రీయే ధైర్యంగా ముందడుగు వేస్తుంది. పురుషుడుగూడా ధైర్యం చూపించలేని సమయంలో స్త్రీ ముందుకు వచ్చి ఫలితాన్ని సాధించిన సంఘటనలనేకంవున్నాయి." అన్నాను.

"స్త్రీలతరఫున ప్రతినిధిలాగ మాట్లాడుతున్నావే?"

"నువ్వు పురుషులవైపు ప్రతినిధివికదూ!"

తర్వాత మా యిద్దరివాదం పోయిపోయి చివరకు ప్రతిజ్ఞల వరకు వచ్చింది.

"ఆల్ రైట్. సరే. అందరి విషయాలూ అనవసరం. మనమిద్దరమే పందెం వేసుకుందాం. నేను స్కూలుఫైనల్ పాసయిన అమ్మాయిని చేసుకుంటాను - నువ్వు ఇంటర్ పాసయినవాడిని చేసుకో. నేను నా భార్యను ఇంటర్ కి చదివిస్తాను. నువ్వు నీ భర్తని గ్రాడ్యుయేట్ చెయ్యి. ఇదే పందెం. చిన్నదేగా. ఒప్పుకుంటావా మరి?" అన్నయ్య సవాల్ చేసాడు.

"ఊరికే కూచుని వాదించుకుని వాదించుకుని, యీ ప్రతిజ్ఞలు తీసుకొని జీవితాలకు అంటగట్టుకుంటారట్రా. ఏదో కాసేపు యిద్దరికీ తెలిసినవి మాట్లాడుకున్నారు. బిగ్గరగా వాదించుకున్నారు. అంతేగాని మీ మొహం ప్రతిజ్ఞలేమిటి?" అమ్మయింక వూరుకోలేక చివాట్లుపెట్టింది.

"నీకెందుకే మధ్య? వాళ్ళ బలాబలాలు వాళ్ళే చూసుకుంటారు. ఆమాత్రం ధైర్యం లేకపోతే పందాలెందుకు వేసుకుంటారు?" నాన్నగారి మాటలు మా యిద్దరిలో మరింతపట్టుదల కలిగించాయి.

"అదిసరేగాని నువ్వుగూడా ఇంటర్ పాసయిన అమ్మాయినే చేసుకోవాలి. పరుగు మొదలుపెట్టేముందు ఇద్దరం ఒకే స్థలంనుంచి పరుగెత్తాలికదా!" అన్నాను.

"కానులేమ్మా. పందెం బాగానేవుంది. అలాగేవుంచు" అన్నారు నాన్నగారు. చివరికా పట్టుదలే మిమ్మల్ని వివాహం చేసుకోవటానికి పురిగొల్పింది. మన వివాహానికి నాకుగల పట్టుదలను చూసి మన బంధువులేగాదు, బహుశా మీరుగూడా ఆశ్చర్యపోయేవుంటారు". శైలజప్రసంగం పూర్తి చేసి భర్తముఖంలోకి చూసింది.

"అయితే నేను పందెంలో పణంపెట్టిన వస్తువన్నమాట" శ్రీధర్ శైలజవంక చూచాడు.

"మీరెందుకవుతారు? నా జీవితం అవుతుంది. మీరు కేవలం గెలుపూ ఓటమి నిర్ణయించే పావులుమాత్రమే," అంది.

"శైలజ నిన్నుతప్ప యెవర్నీ చేసుకో

యద్దన
సులోచ

దుట్రా" అని అవ...
ఆశ్చర్యపోయినమ...
నా అదృష్టం అనుకు...
ఇప్పుడు తెలుస్తోంది...
యెంతవుసాదులు...
శైలా! నేనుగూడా...

# ...లయాలు



...పూడి

...రాణి

...ప్పుడు కొంచెం
... మే. కాని అది
...సంతోషించాను
...నా అదృష్టపు మేడ
...కోవని. అయితే
...మవుతేగదా? అది

మర్చిపోయావా? నిజంగా మీ అన్నయ్యని గెల్పించటమే మగవాడినైన నా ధర్మం. నేను నీకోర్కె చెల్లించటానికి చదివి పాసయితే, మాజాతి మొత్తానికే తీరనికళంకం వస్తుంది. నువ్వు పురుషజాతి మొత్తంమీదే యెందుకు సవాల్ చేశావు?" తీక్షణంగా అడిగాడు శ్రీధర్.

"నేను పురుషజాతిమీద సవాలెప్పుడూ చెయ్యలేదే? ఆడవాళ్ళెంత పట్టుదల గల వాళ్ళో అన్నయ్యకు నిరూపించి చూపించాలనుకున్నాను. నాకు మరో వుద్దేశం లేదు. మీ యిష్టం చదివితే చదవండి. లేకపోతే లేదు. పరాయివాళ్ళయితే వన్నర్థం చేసుకోవచ్చు. చేసుకోలేకపోవచ్చు. మీరు నావారు. వన్నర్థంచేసుకుని సాయం చేస్తారనుకుని ఆశించాను. జీవితంలో యెన్ని ఆశలు నిరాశలవటం లేదు?" శైలజ మొహంతిప్పుకుని కాఫీ కప్పుతీసుకుని అక్కడ నుంచి వెళ్ళిపోయింది. శ్రీధర్ కాసమయంలో శైల విచిత్రంగా కన్పించింది. ఒకబరువైన నిట్టూర్పువదిలి పుస్తకాలు ముందుకు లాక్కున్నాడు.

"శైలా! సరే. పందెంలోమటుకు నీకు విజయంచేకూరేటట్లు చేస్తాను. తర్వాత పురుషు లెంత కఠినులో నీకు నిరూపిస్తాను" అనుకుంటూ నోట్సుతీసుకుని వ్రాసుకోవటానికి ఉపక్రమించాడు.

శైలజ శ్రీధరునే పెళ్ళాడుతానని పట్టుపడ్తోందని విన్న ఒక్కబంధువులేగాదు స్వయంగా శ్రీధరే ఆశ్చర్యపోయాడు. బి. ఎ. పాసయిన భార్య, కావాలని వస్తుంటే యే యువకుడు కాదనగలడు! కృతజ్ఞతాసూచకంగా కానీ కట్నంగూడా పుచ్చుకోలేదు. పెళ్లయింతర్వాత ఒకనెల శైలజ యెంతో ఇదిగా ప్రవర్తించింది. ఇప్పుడనిపిస్తోంది అప్పటి ఆప్రవర్తన కేవలం తన అభిప్రాయాలను తెలుసుకోవటంకోసమేనని. తనసాటిస్నేహితులు తమభార్యలతో పికార్లకు, సినిమాలకు సరదాగాపోతుంటే శ్రీధర్ కుంగిపోయిన మనస్సుతో నిశ్శబ్దంగా చూస్తూవూరుకునేవాడు. స్నేహితు లెవరయినా అడిగితే హృదయంలోలేని బలవంతమైన మందహాసం తెచ్చిపెట్టుకునేవాడు. కాని ఆబాధ చాలసేపటివరకూ మర్చిపోలేకపోయేవాడు. కోపంతో విసుగుతో గబగబా యింటికివచ్చేవాడు. కాని రాగానే నవ్వుతూవున్న మొహంతో యెదురై ఆదరంగా ప్రశ్నించేభార్యను చూడగానే కోపంచప్పగా చల్లారిపోయేది.

* * * *

"జలజా! జలజా!" పైనుంచి మహీధర్ మంచుకుపోతున్నట్లు కేక లెయ్యటం మొదలుపెట్టాడు:

"ఏమిటండీ. అలా బిగ్గరగా చిన్నపిల్లవాడికిమల్లే కేకలు పెడ్తారేమిటి? పోనీ అంతఅవసరమైతే క్రిందికి దిగి రాగూడదూ? అత్తగారు, మామగారు వింటే రేమనుకుంటారు?" జలజ పైకి వచ్చి సన్నసన్నగాచివాట్లు పెట్టింది భర్తని.

"ఏమనుకుంటారు? ఈ భార్య యిన్నిసార్లు పిలిపించుకుంటుందేరా బాబూ అనుకుంటారా? అనుకుంటే అనుకోని నాకేం? అయినా నీకెన్నిసార్లు చెప్పాను? ఎనిమిది కొట్టేసరికి పుస్తకాల ముందుండాలని?" మహీధర్ కాస్తకోపంగా అన్నాడు.

"బాగుందండి, మీరుచెప్పేది. క్రింద అత్తయ్యగారికి కాళ్లు నొప్పులుగా వున్నాయంటే పిసుకుతున్నాను. నేనేమయినా ఇంటి కోడల్ని మరేమయినానా? అత్తయగారి కాళ్ళు ముఖ్యమా, ఇక్కడ మీ పుస్తకాలు ముఖ్యమా? జలజ మళ్లా క్రిందకు దిగిపోబోయింది.

"ఇదుగో జలజా! నాకు కోపంవస్తే మంచివాడినిగాదు తెలుసా? నువ్వురా. కూర్చుని చదువుకో. అమ్మకు నేవెళ్ళి కాళ్ళు పడతానులే. రా! నిన్న పాఠం వచ్చిందా? దానిమీద బాగా వ్యాసం వ్రాయగలవా?"

"మంచివారే, నేనిక్కడ హాయిగా పంకాక్రింద కాలుమీద కాలువేసుకుని కూర్చుని రాణిగారికిమల్లే చదువుకోనా! మీరు పోయి కాళ్ళు పిసుకుతారా! చాల్లెండి యెవరయినా వింటే నవ్వుతారు గూడాను. నాకాచదువూవద్దు చట్టుబండలూ వద్దు. కావాలంటే మీరు ఎమ్. ఎ. కి కట్టండి."

# ★ జీవిత వలయాలు ★

"నన్ను ఎమ్. ఏ. కి కట్టమని నువ్వు చెప్పే దేమిటి? నాకు తెలుసులే. రా! నువ్వు మాట్లాడకుండా వచ్చి పుస్తకాలు తీసుకో" చిన్న పిల్లని టీచర్ కసిరినట్లు కసిరాడు.

"పోనీ వుండండి. క్రింద తలుపులు అవి చూచి [illegible] వస్తాను" అంది పోతూ. మహీధర్ పోబోతున్న జలజని పట్టుకుని బలవంతంగా కుర్చీలో కూలదోసి "నేను వెళ్ళి చూసివస్తానులే" అని తను క్రిందికి వెళ్లిపోయాడు. జలజయేం చెయ్యటానికి తోచక నిస్సహాయంగా చూస్తూ కూర్చుండిపోయింది. మహీధర్ క్షణంలో పైకి వచ్చాడు.

టేబిల్‌కు చెరోవైపు భార్యాభర్తలిద్దరూ కూర్చున్నారు. మహీధర్ సీరియస్‌గా పాఠం చెప్పుకుపోతున్నాడు. జలజ తన్మయత్వంతో అతనివంక చూస్తూ కూర్చుంది. మధ్యలో ఆగి మహీధర్ ప్రశ్న వేశాడు. భర్త ముఖసౌందర్యాన్ని తదేకంగా చూస్తున్న జలజ వెంటనే జవాబు చెప్పలేక పోయింది.

"ఏ లోకంలో వున్నావ్?" తీవ్రంగా అడిగాడు. అతని గద్దింపుకి బెదిరినట్లు చూస్తూ "నాకు నిద్ర వస్తోంది బాబూ!" అంది.

"నాకు రాని నిద్ర నీకెందు కొస్తుంది? ఏవిధంగా వస్తుంది? నువ్వెన్ని చెప్పినా లాభం లేదు. పన్నెండువరకు కూర్చోవాల్సిందే. నాల్గురోజులు పట్టుదలగా కూర్చుంటే అదే అలవాటవుతుంది. దేనికయినా పట్టుదల అనేది వుండాలి" మహీధర్ మళ్లా పాఠం చెప్పటంలో మునిగిపోయాడు. హఠాత్తుగా మళ్ళీ జలజవంక చూశాడు. తనింకా వెనకకు జారగిలబడి కూర్చుని పాఠం వింటోంది అనుకున్నాడు. అదేం లేదు. సుభ్రంగా, హాయిగా నిద్రపోతోంది! అమాయకంగా వెనక్కువాలి నిద్రపోతున్న జలజను చూసేసరికి మహీధర్ హృదయంలో యేదో బాధ కల్గింది. బాధగా నిట్టూర్పు విడుస్తూ, పుస్తకాలు మూసేసి జలజను లేపి, ప్రక్కమీద పడుకోమని, తను వెళ్లి పడుకున్నాడు. అన్ని కిటికీలు తెరిచివున్నాగూడా బొత్తిగా గాలి లేదు. జలజ ముఖంమీద చిరు చెమటలు పోశాయి. మహీధర్ లేచి ఫాన్ వేసి కిటికీలోంచి వచ్చే వెన్నెల్లోకి చూస్తూ జలజను చదివించటంలో తనెలా విజయం పొందుతానా అని ఆలోచిస్తూ పడుకున్నాడు. జలజకు తన అభిప్రాయాలు చక్కగా విడమర్చి చెప్పినా అర్థం చేసుకోదు. పైగా తనకిప్పుడు చదువెందుకంటుంది. ఆదర్శప్రాయుడయిన తన భర్తకి కాళ్ళు పిసగటం అంటే యెంతో యిష్టంట. తన కలాటి మాటలు వింటుంటే ఒళ్ళు మండుకుపోతూవుంటుంది. 'వంట మానెయ్యి, వంటమనిషిని మాట్లాడతా' నంటే, ససేమిరా వద్దని పోట్లాడింది. సహజంగా అందరూ వంటయింటికి దూరంగా వుండాలని ప్రయత్నంచేస్తారు. జలజకి వంట చేసి అందరికీ పెట్టటంలో యే ఆనందం లభిస్తుందో మహీధర్‌కి అర్థం గావటంలేదు. గట్టిగా మాట్లాడితే, కళ్లనిండా నీళ్ళు నింపుకుని, మొహం తిప్పుకుని, మెదలకుండా వెళ్లిపోతుంది. తల పగలగొట్టుకున్నా చచ్చినా సమాధానంగూడా చెప్పదు. అది తనసలే భరించలేడు. ఎదురుగుండా వుండి, తర్కించి పోట్లాడుతుంటేనే బాగుంటుంది. కళ్ళనీళ్ళు పెట్టుకుని వెళ్ళిపోతే తన హృదయం విలవిలలాడ్తుంది. తనకి నెక్‌టై కట్టటంలోనూ క్రాఫ్ దువ్వటంలోను ఒకటేమిటి ప్రతిదీనూ-తనకు సేవ చెయ్యటంలో వున్న శ్రద్ధలో సహస్రాంశమైనా చదువుమీద వుంటే యెంత బాగుంటుంది! చెప్పింది శ్రద్ధగా వింటే పాఠం త్వరగా పూర్తవుతుంది. వెంటనే కొత్త పాఠం మొదలుపెట్టవచ్చు. ఒక్కొక్కసారి మరీ యిష్టంలేనప్పుడు వెధవ ప్రశ్నలు వేసి చంపుకుతింటుంది. అడ్డుప్రశ్నలు వేసి ప్రక్కదారులకు లాగి "పాఠం చెప్పటానికి యింత శ్రమపడ్తె, అసలేవద్దు పొమ్మంటుంది. తనకిబాగా కోపంవస్తే నవ్వుస్తూ, చిలిపిగా మళ్లా చిటికెలో పోగొడ్తుంది. జలజతో తనిలా సతమత మవుతున్నాడు. శైలజ తన భర్తతో యెలా వేగుతోందో! అసలు శ్రీధర్ మహాపట్టుదల మనిషి, మరి కావాలని పట్టుపట్టి అతన్ని చేసుకుంది. అతనిలో మార్పు తేగలదో లేదో? క్రమంగా మహీధరుని కళ్లమూతలు పడసాగినాయి. కొంత సేపటికి నిద్రాదేవి అతనిచుట్టూ తన తెరల్ని దించివేసింది.

* * *

మధ్యాహ్నం రెండు గంటలకు బయట వెళ్లిన శ్రీధరుడు సాయంత్రం ఆరుగంటలయినా యింటికి రాలేదు. నాలుగు రోజుల నుంచీ యిలాగే చేస్తున్నాడు. ఇంట్లో వుంటే చదువో చదువో అని ప్రాణాలు తీస్తుందని తన్ని తప్పించుకోవటానికే యీ యెత్తు వేశాడనుకుంది శైలజ. స్నానంచేసి అతను వచ్చేసరికి అన్నీ సిద్ధపరిచి చదువుకు తయారుచేసుకుంది. ఏమయినాసరే శ్రీధర్‌ని వదిలిపెట్ట గూడదు. తాత్కాలికంగా అతనికి కష్టం వేసినా తర్వాత అయినా తనమంచితనాన్ని గమనించక పోతాడా? ప్రస్తుతం తనకు సహనంగావాలి. అతను యేవిధంగా ప్రవర్తించినా వుద్రేకపడకుండా, ప్రశాంతవదనంతో తనలో యేచికాకూ లేనట్లు వుండాలి. అతనిపట్ల తను నిర్వహించవలసిన పాత్రనుగురించి ఆలోచిస్తూ కూర్చుంది. ఏడు దాటిపోయింది. శ్రీధర్ రాలేదు. పంతానికి శైలజ మేలుకుని కూర్చునివుంది. పదిగంటలు దాటుతుండగా శ్రీధర్ వచ్చాడు. పడక్కుర్చీలో భారంగా మూతలుపడిన కళ్లతోవున్న శైలజను లేపటమా, మానటమా అని క్షణంసేపు తటపటాయించాడు. అడుగుల చప్పుడు విని శైలజ కళ్ళు తెరిచింది.

"స్నానం చేస్తారా?" భీకరమైన తుఫాను వీస్తుందని అనుకున్న శ్రీధర్‌కి ప్రశాంతమైన మలయమారుతం రావటం ఆశాభంగమైంది. "ఊ!" అని ముటుకు అని పైకి తన గదిలోకి వెళ్ళిపోయాడు.

స్నానంచేసిన శ్రీధర్ భోంచెయ్యకుండా వచ్చి మెదలకుండా తన మంచంమీద పడుకుని వూరుకున్నాడు. తలుపులువేసి శైలజ పైకి వచ్చింది. నిద్రపోతున్నట్లుగా గోడవైపు మొహం పెట్టుకుని పడుకున్న శ్రీధర్‌ని శైలజ పన్నెత్తి పలుకరించలేదు. కిటికీ తలుపులు పూర్తిగా తెరిచి, ఫాన్ వేసి ఆరోజు చదవవలసిన పుస్తకాలను డ్రాయరుమీద తెరిచిపెట్టి మెదలకుండా క్రిందికి దిగి వెళ్ళిపోయింది. వెళ్ళిపోతున్న శైలజ అడుగుల చప్పుడును గమనించి శ్రీధర్ వెనక్కి తిరిగాడు. డ్రాయర్‌మీద ఫ్లాస్కులో టీ, తెరిచిపెట్టిన పుస్తకాలు మౌనంగా శైలజ అభిప్రాయాన్ని అందిస్తున్నాయి. ఫాన్ గాలికి పుస్తకంలోవున్న ఒక కాకితం రెపరెపలాడుతూ యెగురుతోంది. శ్రీధర్ లేచి వెళ్లి పుస్తకాలముందు కూర్చుని గాలికి బయటకు రావాలని ప్రయత్నం చేస్తున్న కాగితాన్ని తీశాడు. అందులో:

"మిమ్మల్ని విసిగించి బాధించటం నా కిష్టమైన పనిగాదు. ఇష్టమైతే పాఠాన్ని చదవండి. లేకపోతే మానెయ్యండి. అంతేగాని యెవరిమీద కోపం యెవరిమీదో చూపించినట్లుగా నామీద కోపంలో ప్రొద్దుపోయేవరకు అక్కడా, యిక్కడా తిరగవద్దు. ఆరోగ్యం పాడవుతుంది. నిరపరాధులకు శిక్ష యివ్వటం మీ సాంప్రదాయమేమోగాని నేను భరించలేను. శైలజ" అని వుంది. శ్రీధర్ కాగితాన్ని మడిచి జేబులో పెట్టుకుని శైలజ తీసిపెట్టిన పాఠం కాకుండా యింకా ముందుపాఠం చదవసాగాడు.

శైలజ తన గదిలోకి వెళ్ళిపోయి పడుకుందన్న మాటేగాని నిద్రపట్టలేదు. ఏదయినా పుస్తకం తీసుకుని చదువుదామని ప్రయత్నం చేసింది. కాని మనసు పుస్తకంమీద నిల్వలేదు. ఒళ్లో పుస్తకం అలాగే వదిలేసి

ఆలోచన చెయ్యిపెట్టుకుని శూన్యంలోకి చూస్తూ కూర్చుండిపోయింది.

"శైలా! అబ్బాయి వచ్చాడుటే" ప్రక్క గదిలోంచి పిల్చిన అత్తగారి పిలుపుతో యీ లోకంలోకి వచ్చింది. వారంరోజులనుంచి ఆవిడ ఒంట్లో యేమీ బాగుంటంలేదు.

"వచ్చారు. పిలవమంటారా?" లేచి తన గది గుమ్మంవరకువచ్చి అడిగింది శైలజ.

"వద్దులే. యేం చేస్తున్నాడు. భోంచేశాడా?"

"చదువుకుంటున్నారు. భోంచెయ్యలేదు" నంబర్ వారీగా శైలజ సమాధాన మిచ్చింది. తనూ భోంచెయ్యలేదు కానీ, అడిగేదెక్కడి తనకు?

"అయ్యో ఇంకా చెయ్యలేదూ? ఇంకెప్పుడుచేస్తాడే? వాడిని పిల్చి లాలింపుగా భోజనమన్నా పెట్టటం చాతగాదునీకు. మీరిద్దరూ యెలా బ్రతుకుతారేనాతల్లీ" అంటూ అత్తగారు ముక్కుతూ మూలుగుతూనే లేచి పైకివెళ్ళింది.

శైలజ కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. ఏతావం దాన్ని ఆసించి తను తనబ్రతుకు ఈవిధంగా నాశనం చేసుకుంటోంది. మెదలకుండా వెళ్ళి తన మంచంమీద పడుకుంది. కళ్లంబడి నీళ్లు వెచ్చగా పక్కలకు కారిపోతున్నాయి. తన జీవితం పూర్తిగా సర్వనాశనమైనాసరే తను పట్టినపట్టు విడువకూడదు. ఆడవాళ్ళ పట్టుదలలో యెంత గట్టిదనముందో ఒక్క అన్నయ్యకేగాదు భర్తకి కూడా నిరూపించాలి. శైలజలో ఒకవిధమైన మొండితనంరేకెత్తింది.

మర్నాడు శైలజ లేచేసరికి శ్రీధర్ లేవటం స్నానం చెయ్యటం, కాఫీ త్రాగటం ఎక్కడికో వెళ్ళిపోవటం కూడా జరిగిపోయింది. అత్తగారికి ఒంట్లో కులాసా చిక్కింది గాబోలు. ఉదయమే లేచి కొడుక్కి వేడి నీళ్లుపెట్టియిచ్చి, కాఫీకలిపియిచ్చింది. శైలజ అత్తగార్ని యేమీ ప్రశ్నించదలుచుకోలేదు. కాఫీ త్రాగినతర్వాత భర్త గదిలోకి వచ్చి చూసింది. ఫ్లాస్కులో టీ కదలలేదు. తెరిచి పెట్టినపుస్తకంలో పేజీలు ముందుకుపోలేదు. యెక్కడపెట్టినవి అక్కడే వున్నాయి. గుండెల్లో మండుతున్న మంటని శైలజ అతి జాగ్రత్తగా దాచేసుకుని, ప్రశాంతవదనంతో క్రిందికిదిగి వచ్చేసింది. వంట చేయటానికి ఉపక్రమిస్తుంటే అత్తగారు కలగజేసుకొని 'నేచేస్తాలే' అంది. వద్దనలేదు. ఎందువల్లనో యేకాంతంగా వుండాలని కోరుతోంది శైలజ మనసు. స్నానాదులు పూర్తిచేసుకుని వచ్చి గదిలోకూర్చున్న శైలజను అత్తగారువంటవ్వగానే, "నీకు ముందర పెట్తాను రావే శైలా" అని పిల్చింది. వద్దులెమ్మని భర్త రాకకోసం యెదురుచూస్తూ కూర్చుంది.

పన్నెండు దాటినతర్వాత శ్రీధర్ అలిసిన మొహంతో, బడలికగా యింటికి వచ్చాడు. శైలజను ఒక్కముక్కగూడా అడగలేదు. కావలసిన అవసరాలు తల్లి ద్వారా తీర్చుకుని, భోంచేసి మెదలకుండా తన గదిలోకి వెళ్ళిపోయాడు.

అత్తగారితోపాటు తనూ భోంచేసి శైలజ పైకి వచ్చింది. కాని శ్రీధర్ మంచినిద్రలో వున్నాడు. డ్రాయర్ దగ్గర కుర్చీలోకూర్చుని నిద్రపోతున్న శ్రీధర్ మొహంలోకి రెప్పవాల్చకుండా చూసింది. ఫాన్ గాలికి అతని నొక్కుల జుట్టు అలలు అలలుగా లేస్తూ వుండటంతప్ప అతనిలో మరేచలనమూ లేదు. నిద్రపోతుంటే మొహం మరింత అందంగా వుంది. క్రమంగా ఆమొహం తనకు దూరమైపోతే! ఈ భావానికి తట్టుకోలేకపోయింది. నిద్రలోనే అతను ఒకప్రక్కకు తిరిగి పడుకున్నాడు. ఖంగారుగా క్రిందికి దిగి వచ్చేసింది శైలజ.

హాల్లో ఒక కుర్రాడు నిలబడి అత్తగారిని యేదో అడుగుతున్నాడు. శైలజను చూడగానే అత్తగారు.

"చూడు శైలా. ఈ కుర్రాడికి అబ్బాయి కావాలిట. యేం చేస్తున్నాడు? వాడితో చెప్పు. నేనలా మా రాజమ్మగారింటికి వెళ్ళి వస్తాను. తలుపులు జాగ్రత" అని అత్తగారు వెళ్ళిపోయింది.

"యేం కావాలినీకు?" యెదురుగా నిలబడి అమాయకంగా తన మొహంలోకి చూస్తున్న కుర్రాడిని అడిగింది. అతనికి నిండా పదేళ్లన్నా లేవు. తెల్లగా బొద్దుగా వుండి ముద్దొస్తున్నాడు.

"మాఅక్క యీవుత్తరం యిచ్చి రమ్మందండీ" అంటూ నిక్కర్ జేబులోంచి ఒక వుత్తరం తీసి యిచ్చాడు.

"యెవరికి?" శైలజ కంఠంలో మార్పు వచ్చింది.

"శ్రీధర్రావుగారికి" అన్నాడు కుర్రాడు తడుముకోకుండా. బాగా పరిచయమైన పేరన్నమాట అనుకుని వుత్తరం తెరిచి చూచింది. అందులో రెండే రెండు వాక్యాలున్నాయి.

"సాయంత్రంవరకూ మేం యింట్లో వుండం. రాత్రికిరండి" క్రింద సంతకంలేదు. దస్తూరి ఆడవాళ్లదని స్పష్టంగా తెలుస్తోంది. అందులోవున్నవి రెండు వాక్యాలేఅయినా నాలుగుసార్లు చదివినా శైలజ కర్థంగాలేదు. తలెత్తిచూచేసరికి పిల్లాడు వెళ్ళిపోయాడు. ఉత్తరం శ్రీధరుడికి యివ్వటమా మానటమా అని కాసేపు తటపటాయించింది. చివరకు ఇవ్వటానికే నిశ్చయించుకుని మెట్లు యెక్కింది. గది గుమ్మంలో అడుగుపెట్టబోయేసరికి అతను నిద్రపోవటం లేదు. లేచి కూజాలోవున్న నీళ్లతో మొహం కడుక్కుంటున్నాడు. శైలజ చప్పుడు చెయ్యకుండా వుత్తరం డ్రాయరుమీద పెట్టి వెనక్కి తిరిగి వచ్చేసింది.

"శైలా కాఫీ తెచ్చిపెట్టు." అతని కంఠములోగల అధికారానికి వెనక్కితిరిగి చూడకుండా వుండలేకపోయింది. శ్రీధర్ శైలజను గమనించలేదు—వుత్తరం చూసుకుంటున్నాడు. అతని కంఠంలో మార్పును గమనిస్తూ కాఫీ పట్టుకెళ్ళింది.

శ్రీధర్ ఫ్లాస్కులో కాఫీ కప్పులోవంపుకుంటూ శైలజ మొహంవేపుచూడకుండానే "నేనలా బజారుకు పోయివస్తాను. సినిమాకు పోదాం. రెడీగా వుండు," అన్నాడు.

"నేను నిజంగా మీతో సినిమాలకు,షికార్లకు రావాలని వుంటే, మీరీవిధంగా యెందుకు ప్రవర్తిస్తారు? మీరు వెళ్లండి. నాకు సినిమాలు వద్దు సిద్ధ మోక్షాలూ వద్దు," కోపముతో మొహం తిప్పుకుని శైలజ వెళ్ళిపోయింది. ఎఱ్ఱబడ్డమొహంతో వెళ్ళిపోయిన శైలజను చూసి శ్రీధర్ మధురంగానవ్వాడు. అతనిలో ఒకవిధమైన హుషారు వచ్చింది. అద్దంలో చూసుకుని తల దువ్వుకుంటూ 'శ్రీధర్! అంతే. శైలను ఈ నాల్గురోజులూ అలా యేడిపిస్తే ఇటు నీకు చదువూ సాగుతుంది. అటు శైలలో మార్పూ వస్తుంది," అని ప్రతిబింబంతో చెప్పుకున్నాడు. మరోమారు అతని పెదవులు చిలిపిగా నవ్వాయి.

ఒక అరగంట గడిచిన తర్వాత నీట్ గా టాయిలెట్ చేసుకుని, మన్మథుడిలా మెరిసిపోతూ, హుషారుగా యీలమీదపాటపాడుకుంటూ బయటకు వెళ్ళిపోయిన శ్రీధర్ను చూస్తూ శైలజ తన గదిగుమ్మంలో అలాగే ప్రతిమలాగ నిలబడిపోయింది.

ఆ సాయంత్రం వెళ్ళిన శ్రీధర్ రాత్రి రెండు గంటలయింతర్వాత ఇంటికి వచ్చాడు.

"ఇంతసేపు యెక్కడున్నావురా?" తల్లి అడిగింది.

"స్నేహితులు బలవంతం చేశారు. రెండు సినిమాలూ చూడాల్సి వచ్చిందమ్మా."

ఆ రాత్రి శ్రీధర్ గదిలోని లైటు వెలగలేదు.

* * *

[మిగతా కథ పైవారం]

# జీవిత వలయాలు



[గతవారం తరువాయి]

“ఆల్ రైట్. వెరీగుడ్. ఇవాళ బాగా చదివావు పాఠం. ఏం కావాలో కోరుకో మరి వరమిస్తాను” అన్నాడు మహీధర్ అలిసిపోయి కుర్చీలో వెనక్కు వాలిన జలజవంక చూస్తూ.

★ యద్దనపూడి సులోచనారాణి ★

“ఒక్క వారంరోజులవరకూ పుస్తకం ముట్టను. సెలవు మంజూర్ చెయ్యండి” వినయంగా అంది జలజ, వచ్చిన అవకాశం జారవిడుచుకోకుండా.

“అదేలా జలజా! పరీక్షలు దగ్గరకు రాలా?” అన్నాడు మహీధర్.

“అంతేలెండి. లేకపోతే మీరు యిచ్చిన మాట నిలబెట్టుకుంటారని నేనేమీ అనుకోలేదు.” జలజ మూతి వయ్యారంగా ముడుస్తూ అంది.

“అది కాదు డియర్. మరేదయినా కోరుకోమని మనవి. అంటే ఆడవాళ్లకు కావాల్సినవి, సినిమాలు, ఫస్టుక్లాసు చీరలు, కంటికింపైన జాకెట్లు, తళతళలాడి ధగధగ మెరిసే నగ...”

“ఆగండి. ఆగండి. అవన్నీ నాకు పుష్కలంగా వుండి వెక్కసంగా వున్నాయి. నాకు లేనిదల్లా ఒక్కటే,” అంది జలజ.

“ఏమిటది?” ఉత్సాహంగా ముందుకు వంగాడు మహీధర్.

“విశ్రాంతి” అంటూ జలజ టేబిల్ ముందునుంచి లేచింది.

“విశ్రాంతి లేదంటున్నావా?” తన

కూడా కుర్చీలోంచి లేస్తూ అన్నాడు మహీధర్.

"నిజంగా నేనండి. కేవలం మీ సంతోషం కోసం మిమ్మల్ని సంతృప్తి పరచటానికి గాను ఒక యంత్రంలాగ చదువుతున్నాను."

"ఆ మాట నాకు చాల సంతోషాన్ని కలిగిస్తోంది జలజా!" మహీధర్ కంఠంలో మధురమైన ఆప్యాయత నిండుగా తొణికిసలాడ్తోంది.

జలజ కిటికీలోంచి శూన్యంలోకి చూస్తూ చెప్తోంది.

"మీకు కాళ్ళు పట్టటంలో, మీస్నానానికి నీళ్ళు తోడటంలో యెలాంటి శ్రద్ధ చూపిస్తానో మీరు చదవమన్న ఆ చదువులోనూ ఆ శ్రద్ధ చూపిస్తాను. మీరు చెప్పారు కాబట్టి చేస్తున్నాను కాని ఒక్కొక్కసారి ఆ పుస్తకాలు చూస్తుంటే తీసుకెళ్ళి పొయ్యిలో మంటపెట్టాలన్నంత కోపంవస్తుంది" అంటూ వెనక్కు తిరిగింది జలజ.

మహీధర్ జలజ పడకని సరిచేస్తున్నాడు.

"దాంతో మీకేంపని?" తీవ్రంగా అడిగింది.

"విశ్రాంతి లేనివాళ్ళకు విశ్రాంతి కల్పించటం ప్రక్కనున్న మానవుల కనీసధర్మం. ఇందులో తప్పేముంది. అసలయినా మనమిద్దరం సమాన భాగస్థులం. మనిద్దరిలో యెక్కువ తక్కువ భేదాలని నేను సహించను. రోజూ నువ్వు నా పనులన్నీ చూడటంలేదూ? ఈ ఒక్కరోజున, అందులో నువ్వలసిపోయివున్న సమయంలో యీ పని చేస్తుంటే, దానిలో తప్పులేదు సరిగదా అది నా ధర్మంకూడాను" అన్నాడు మహీధర్.

"అయ్యో మీ ధర్మాలు బంగారంకానూ! యెవరన్నా చూస్తే ఈ ధర్మాలని చూస్తారుటండి. దీనికళ్లు నెత్తికెక్కాయి; సిగ్గూ యెగ్గూ లేకుండా మొగుడిచేత పక్క వేయించుకొంటోంది, అనుకుంటారుగాని." జలజ వచ్చి మహీధర్ చేతిలో దుప్పటి లాక్కుంది.

"ఒక్కొక్కసారి నువ్వు మరీ యింత అమాయకంగా మాట్లాడతావేం? జలజా!" నవ్వుతూ అన్నాడు.

"చాలెండి. నేర్చారు మహాలావ్. మీలాటివారితో ప్రవర్తించటం కత్తిమీద సాము. ఆగ్రహంవచ్చినా పట్టలేం. అనుగ్రహంవచ్చినా పటలేం. కాసేపు చదువుకి రావడాని కాలస్యమైతే ఈ మందహాసాలు, దరహాసవదనాలు యెక్కడకు పోతాయో మరి" జలజ కోపంగా అంది.

"నువ్వు కోపంలో యింత అందంగా వుంటావని నా కిదివర కెప్పుడూ తెలియదుసుమా," అన్నాడు మహీధర్ తన ప్రక్కపై కూర్చుంటూ ఆశ్చర్యం అభినయిస్తూ.

"ఇప్పటికైనా తెలుసుకున్నారు. ధన్యులం. జన్మ తరించింది." జలజ మామూలుగా అన్నా అందులో యేదో వ్యంగ్యార్థం వూహించాడు మహీధర్. ప్రక్కమీద పడుకుంటూ.

"నన్నుగురించి నీకేం తెలుసు జలజా. ఇది నాలో కేవలం తెచ్చిపెట్టుకున్న రూపు మాత్రమే. మరోరూపు నువ్వు చూడలేదు కాబట్టి ఆ విధంగా తలచటం సమంజసమే. ఆ రోజూ దగ్గరికి వస్తోందిలే. ఆ నాడు నువ్వు 'మీ రెంత మంచివారండి' అంటూ వచ్చి నా గుండెలమీద వాలవూ?" లోలోపల అనుకున్నాడు మహీధర్.

"కొంతమంది అర్థంలేని ఆదర్శాలకోసం జీవితధర్మాలు, వాటి విలువలు మర్చిపోతుంటారు. మహీధర్ ఆ జాతివాడేనని పిస్తోంది. కానీ, పరిస్థితి విషమించేరోజున ముందుకువచ్చి అతన్ని యెదిరించి నా జీవితమార్గం చక్కబరుచుకుంటాను. తొందరపడటందేనికి?" అనుకుంది జలజ నిద్రకుపక్రమిస్తూ.

* * *

పరీక్షలింకా రెండుమూడురోజు లున్నాయనగా ఒకరోజు సాయంత్రం శ్రీధర్ పెట్టెలో బట్టలు సర్దప్రారంభించాడు.

"పెట్టె సర్దుతున్నారెందుకు?" శైలజ ఆశ్చర్యంగా ప్రశ్నించింది.

"చంద్రమోహన్ పెళ్లి. వెళ్లాలి" ముక్తసరిగా జవాబిచ్చాడు శ్రీధర్.

"ఎల్లుండినుంచీ పరీక్షలు మొదలు. జ్ఞాపకంలేదా?" కోపం బలవంతంగా దిగమింగి అడిగింది.

"ఎందుకు జ్ఞాపకంలేదూ? ఉంది."

"మరి?"

"స్నేహితుడిపెళ్ళి జీవితంలో ఒకసారే వస్తుంది. పరీక్షలు అనేకసార్లు వస్తాయి" నిర్లక్ష్యంగా అన్నాడు శ్రీధర్ బట్టలు సర్దటం పూర్తిచేస్తూ.

"అయితే యిన్నాళ్ళనుంచి చదివిన చదువు ఒక్క స్నేహితుడి పెళ్ళికోసం నాశనంచెస్తారన్నమాట. జీవితంలో స్నేహితుడి వివాహం ఒకసారే వస్తుందని గొప్పగా చెప్తున్నారుకాని ఎంతో అమూల్యమైన కాలం పాడయిపోతుందని తెలియదన్నమాట. నా కోరికకంటే మీ స్నేహితుడి వివాహం ఎక్కువగదూ? ఇదేనామరి పెళ్ళయిన కొత్తలో మీ జీవితంకంటే నా జీవితమే ముఖ్యమని చెప్పారు" తనదగ్గరున్న అస్త్రాలన్నిటిని తీసి ప్రయోగిస్తోంది శైలజ.

"నువ్వందరి భార్యలులాగ ప్రవర్తిస్తే నేనూ అంతకంటే ఎక్కువగానే చూసేవాడిని. నా మాటలు నాకు గుర్తుచేసేముందు నీ ధర్మాన్ని నువ్వు సరిగా నిర్వర్తించావో లేదో జ్ఞాపకంచేసుకుని మరీ అడుగు. నిజమే! నా జీవితంకంటె కూడా నిన్నెక్కువగా ప్రేమించాను. ప్రేమించాను కాబట్టే అర్థంలేని నీ ఈ ఆటలు ఆడినట్లుగా సాగుతున్నాయి. ఈ నాడు నీ మాటను కాదని తోసేస్తున్నానంటే అది నువ్వుచేసుకున్నదే, నువ్వు కావాలని నీ విలువను పోగొట్టుకున్నావు. దానికి నన్నేం చెయ్యమంటావ్?" పెట్టెకి తాళంవేస్తూ అన్నాడు. అతనిమాట లెంత ప్రశాంతంగా వున్నా వాటిలో తీవ్రమైన కఠోరత కన్పిస్తోంది.

"అయితే వెళ్ళటానికే నిశ్చయించుకున్నారన్నమాట" ఆఖరుమాటగా అడిగింది శైలజ.

"నిర్ణయించుకోకపోతే ప్రయాణం ఎలా అవుతాను?" వ్యంగ్యంగా అన్నాడు శ్రీధర్.

"మీరు వెళ్ళగలిగేది నన్ను మీచేతులలో శవంగా మార్చిన తర్వాతనే, గొంతులో ప్రాణంవుండగా మిమ్మలను పోనీయను." శైలజ మూర్తీభవించిన చండీదేవతలా అంది.

శ్రీధర్ భార్యమొహంలోకి క్షణం చూచి "అంటే నిన్ను చంపి వెళ్ళమనా నీ అభిప్రాయం? ఎందుకూ? నీ కంత యిష్టం లేకపోతే మీ అన్నయ్య దగ్గరకు వెళ్ళిపో. మీ వదినకూడా పరీక్షలకి చదువుతోంది కాబోలుగా. పాపం కాస్త సాయమైనా చేద్దువుగాని." శ్రీధర్ అంత హేళనగా మాట్లాడగలడని శైలజ యెన్నడూ తలచలేదు.


"మీయిష్టం వచ్చినట్లు మాట్లాడండి. దానికి నేనేమీ అనను. ఆ పరీక్షలు వ్రాసి మీ యిష్టంవచ్చినచోటుకు వెళ్ళండి. నేనడ్డుపెట్టను." బలవంతంగా యేడుపు ఆపుకుని అంది.

"అవును లేమరి పరీక్షలయిన తర్వాత యింకెందుకు మరి? పందెంలో పావుల పని అయిపోతుందిగా! పరీక్షకు వెళ్ళటమంటూ వుంటే తప్పకుండా పాసవుతానని నీకు


ఉచితము



కాశ్మీర్ శాలువ
పెద్ద సైజు
రూ. 5/-
మీకు నచ్చిన రంగులలో ప్యాకింగు-తపాల ఖర్చులు రు. 1-50
రెండు శాలువలకు ఆర్డరు పంపిన ప్యాకింగు, తపాలఖర్చులు ఉచితము.
MODERN SHAWL HOUSE (D. A. P.)
Kamla Maket, New Delhi.



తిరువణ్ణామలై పుణ్యక్షేత్రంలో కొండమీదినుంచి చూస్తే కనిపించే శ్రీ అరుణాచలేశ్వరదేవాలయదృశ్యం. ఇటీవల కార్తికదీపోత్సవానికి ఈ కొండశిఖరంమీద దీపాలు వెలిగించారు. ఈ ఉత్సవానికి ఏటా వేలాది యాత్రికులు వస్తారు.

# ★ జీవిత వలయాలు ★

తెలుసు. గెలుపు చూపించుకుని అన్నయ్యను ఎక్కిరించవచ్చు. అందుకు నేనొక సాధన మన్నమాట. బజారులో కొన్న యంత్రం మీదవుంటే దృష్టితప్ప నువ్వు యేనాడయినా నన్ను భర్తగా చూశావా? ఛీ! భర్తని పందెంలో పావుగా ఉపయోగించుకునే స్త్రీలు ఇంతవరకూ జన్మించలేదు. నేటి కాలానికి నువ్వుపుట్టావు. నీ పైపై మెరుగులు చూచి మోసపోయినందుకు మంచి శాస్తి చేశావు. సరే! పరీక్షలయిం తర్వాత మనిద్దరికీ రాం రాం!" పెట్టెతాళంచెవి భార్య మీదకు విసిరి కొట్టి ఇలా అన్నాడు. "సరే. ప్రయాణం ఆపేస్తున్నాను. కాని ఒకటి గుర్తుంచుకో. పరీక్షలయిన మరుక్షణంనుంచి నీకూ నాకు యేలాటి సంబంధమూ లేదు. డిగ్రీకాగితం తీసుకుని నా జీవితంలోంచి మారుమాట్లాడకుండా నిష్క్రమించు. నీకు వెయ్యి నమస్కారాలు. నీగెలుపు ఓటమి లతో నాకు సంబంధంలేదు. నన్నింతటితో వదిలిపెట్టు." అప్పటి పరిస్థితులలో శైలజ మొహంచూస్తే శ్రీధర్ అన్నిమాటలు అనటానికి సాహసించి వుండేవాడుగాదు. శైలజ మొహంచూడకుండానే గదిలోంచి బయటకు వచ్చేసి క్రిందికి దిగివెళ్ళిపోయాడు. చాలా సేపటికి వాడిపోయి రక్తంలేని మొహంతో క్రిందకు వచ్చిన కోడల్ని అత్తగారు అర్థంగానట్లు చూసింది.

* * *

క్రమంగా పరీక్షలయిపోతున్నాయి. శ్రీధర్ పరీక్షలకు వెడుతున్నాడు వస్తున్నాడు. కాని ఒక్కరోజున కూడా యీ విధంగా వ్రాశానని శైలజతో చెప్పలేదు. ఆఖరిరోజున పట్టలేక తనే అడిగింది.

"తేలికగా వున్నాయా? మీరు అనుకున్న ప్రశ్నలే వచ్చాయా?"

"ఆ! కాను వస్తుందిలే. లేకపోతే నీకు తృప్తి వుండదుగా. పందెంలో పావుగా నా ధర్మాన్ని బాగానే నెరవేర్చుకుంటాను. నా జీవితంలోంచి నువ్వు నిష్క్రమించేటప్పుడు నీ మొహంలో నాకు అసంతృప్తి కన్పించకూడదు." శైలజ మరో మాట మాట్లాడలేక పోయింది. చెదురుతూ తన వంక చూస్తున్న భార్యని గమనించనట్లుగా శ్రీధర్ వెళ్ళిపోయాడు. అలవాటు చొప్పున "యెక్కడికి వెళ్తున్నారని" ఆ ప్రశ్న నోటిదాకా వచ్చినా అతని మొహం చూడగానే అక్కడే బిగుసుకు పోయింది. ఆ రాత్రి జీవితంలో మొట్టమొదటిసారిగా తన పరిస్థితికి హృదయ విదారకంగా యేడ్చింది శైలజ.

పరీక్షలయిన వారంరోజులకి మహేశ్వర్ దగ్గరనుంచి వుత్తరం వచ్చింది. అందులో శైలజ పరీక్షలు బాగానే వ్రాసింది అని వ్రాస్తూ తన చెల్లెల్ని తీసుకుని వస్తే వేసవికాలం రెండు నెలలూ తనవూళ్ళో సరదాగా గడుపవచ్చుని మరీమరీ యిద్దర్ని రమ్మని కోరుతూ వ్రాశాడు. శ్రీధర్ వుత్తరం భార్యచేతికిస్తూ "అయితే పెట్టె సర్దుకో" అన్నాడు.

"సర్దుకో అంటున్నారు, మరి మీరు రారా?" అంది శైలజ. ఆమెలో మునపటి తీవి, అహంకారం లేవు. ఏమాటంటే యే విపరీతార్థం తీస్తాడోనని చాలాతూచి మాట్లాడుతున్నది.

"నీకు ముందే చెప్పాను. పరీక్షలయిన తర్వాత మనిద్దరికీ యేవిధమైన సంబంధమూ వుండకూడదని." అతని మాటల్లో చలనం లేని కఠినత్వం చూసి శైలజ యేమాత్రం చెదరకుండా.

"సరే చూస్తాను. బ్రహ్మరుద్రులు వచ్చినా నన్ను మీ దగ్గర్నుంచి తీసుకెళ్ళలేరు. నా పట్టుదల సంగతి మీకు కొత్త గాదు, బాగానే తెలుసు." శైలజ క్రిందికిదిగి వచ్చేసింది.

ఆ రాత్రి భోజనం చేస్తుండగా కొడుకుని తల్లి మందలించింది. "ఎందుకురా దానిమీద చిర్రుబుర్రులాడుతావు. అదేం చేసింది? నిజంగా అది పట్టుదల పట్టబట్టి గాని లేక

పోతే నువ్వంత యిదిగా చదివేవాడివా? దాని పట్టుదలకు మెచ్చుకునేది పోయి కస్సుబుస్సు అంటావే?" శ్రీధర్ కి సమాధాన మేం చెప్పాలో తోచలేదు.

*   *   *


నాలుగ్రోజుల అనంతరం మహీధర్ ఉత్తరం ప్రత్తరం లేకుండా జలజతో సహా బండిదిగాడు. వీళ్ళురాక యెందుకో అర్థంగాక యేవో రెండుమూడు కుశల ప్రశ్నలు వేసి మెల్లగా బయటకు జారుకున్నాడు. శ్రీధర్. ఎవరో స్నేహితుని కలుసుకోవాలంటూ మహీధర్ గూడా ఫోంచేసి వెళ్ళిపోయాడు.

వదినా మరదళ్ళిద్దరూ వచ్చి గదిలో కూర్చున్నారు. పరీక్షుల పేరుచెప్పి భర్త తన్నెవిధంగా తిప్పలుపెట్టింది జలజ తన కథంతా వెళ్లబోసుకుంది. అంతా చెప్పి చివరకు "వీళ్ళకి హృదయాలుండవు శైలా. అర్థంగాని అదర్శాలకోసం అందమైన జీవితాలని ఆనందమయంగా చేసుకోవాల్సింది పోయి ముళ్ళకంపలు చేసుకుంటారు. లేకపోతే నాకిప్పుడు చదువేమిటి నామొహం, చెప్పు. ఆ పాడుడిగ్రీ లేకపోతే వచ్చిన లోటేమిటి? దానికోసం యెంత అమూల్యమైనకాలం పాడుచెయ్యాల్సి వచ్చిందో చూడు. శూన్యంలోకి కళ్ళు తెరుచుకుని అప్పవాల్చకుండా చూస్తున్న శైలజ తన గోడు వింటంలేదని పాపం జలజకు తెలియదు.

హృదయం విప్పి మాట్లాడుతున్న జలజతో శైలజ తనకథ చెప్పకుండా వుండలేకపోయింది. అంతా చెప్పి చివరికి. "అసలు నేనంటేనే విరక్తి చెందారేమోనని యిప్పుడు భయమేస్తోందిజలజా. నిజంగా ఆయనన్నట్లునావిలువను నేనే నాచేతుల్తో నే పాడుచేసుకున్నానేమో అనిపిస్తోంది. మునుపు ఆయనదగ్గరుండే చనువు నాకిప్పుడు లేదు. దీని పర్యవసానం యేమవుతుందో తెలియకుండావుంది. పైకి యింత బింకంగా కన్పిస్తున్నాను గాని యేక్షణాన యేం జరుగుతుందోననే భయం." కళ్ళ నీళ్లు తుడుచుకుంటూ అంది శైలజ. అంతా విన్న జలజ కోపంగా...

"అయితే అన్నా చెల్లెళ్ళిద్దరూ ఒకటేపైపన్నమాట. మేమేం చేస్తామమ్మా మీకు. మమ్మల్నిలా వేధించి చంపారు. మీ అన్నయ్య జీవితం గూడా తెగిపోవాల్సిందే. నా సహనంవల్ల వుందిగాని." తనఒళ్ళోవాలి పసిపిల్లలాగ విలపిస్తున్న శైలజను చూసేసరికి జలజకి కోపంపోయి స్త్రీసహజమైన దయ పుట్టింగింది.

"ఇప్పుడు బాధపడే యేం ప్రయోజనం శైలా! జరిగిన దానికి క్షమించమని అతన్ని అడగటమే మంచిదనిపిస్తోంది నాకు."



తిరువణ్ణామలైలో 'శివగంగ' కోనేరు సమీపమునగల అరుణాచలేశ్వర దేవాలయం. వెనకాల కనబడే కొండమీదనే కార్తికదీపోత్సవం జరిగింది.

—ఫొటోలు : ఎన్. రామకృష్ణ.]

"ఆపరిస్థితి గూడా దాటిపోయింది జలజా" శైలజ మరింత యేడుస్తూ అంది. శైలజతల నిమురుతూ జలజ చాలసేపు అలాగే కూర్చుండిపోయింది. కాసేపటికి యేదో తోచినట్లుగా శైలజమీదకువంగి,

"శైలా! ఇటు చూడు. ఇది మంచి ప్లానుగా నాకు తోస్తోంది. ఇది ఒక్కటే బాగా నాకు నచ్చింది. ప్రయత్నించి చూడు," అంది.

"ఏమి టది?" ఉబ్బిపడి వాచిపోయిన కళ్ళనెత్తుతూ అడిగింది.

జలజ వంగి శైలజచెవులో ఏదో రహస్యం చెప్పింది.

శైలజ మొహం విప్పారిసా అందులో అది ఫలిస్తుందా అన్న అనుమానం తొంగిచూడకపోలేదు.

"సరే! ప్రయత్నించి చూస్తాను" అంది.

మర్నాడు ఫోంచేసి అందరూ క్రింది హాలులో కూర్చుని ఉండగా గోపీ పరుగెత్తుకు వచ్చాడు. వస్తూనే మహీధర్ దగ్గరకు వెళ్లాడు. శ్రీధర్, శైలజ ఆశ్చర్యంగా చూస్తున్నారు.

"అక్కా, బావా వస్తున్నారు," అన్నాడు.

"ఇతను నీకెలా తెలుసు?" శ్రీధర్ ఆశ్చర్యంగా అడిగాడు.

"వాళ్ళ బావ నా డియరెస్ట్ ఫ్రెండ్. మొన్న నాతోనే యీవూరు వచ్చాడు. నేను అక్కడకు వెళ్ళటంతో బాగా చనువయ్యాడు." అన్నాడు మహీధర్.

"అన్నయ్య శ్రీధర్రావుగారి డియరెస్ట్ ఫ్రెండ్ అన్నాడు" అన్నాడు పట్టాడు.

మహీధర్ "ఊ! అలాగా. ఏం శ్రీధర్ రాజారావు నీ ఫ్రెండేనా" అన్నాడు. శ్రీధర్ నవ్వాడు.

ఇంతలో పల్చగా పొడుగ్గా వున్న ఒక అమ్మాయి, రాజారావు, మోహన్ వచ్చారు. ఎవరి స్నేహితుల్ని వారు చిరునవ్వులతో పలకరించుకున్నారు. రాజారావు నవ్వుతూ "ఈమె మా చెల్లెలు పద్మ. భర్త మోహన్.

"ఇంక మా శ్రీమతి ఒక్కతే తక్కువైంది అన్నాడు" అందరూ నవ్వారు.

"మీ రిజల్ట్స్ యెప్పుడు తెలుస్తాయి శ్రీధర్" అని అడిగాడు మోహన్. పద్మ గూడ శైలజ, జలజలతో చాల చనువుగా మాట్లాడింది. అంతవరకూ నవ్వుతూన్న శ్రీధర్ మొహంలో రంగులు మారాయి. అది ఒక్క శైలజ దృష్టికి తప్ప యెవ్వరికీ అంతలేదు.

"కాను వస్తుందా?" మహీధర్ రాజారావు నడిగాడు.

"యెవరికీ అన్నయ్యకా? అన్నయ్యకేమోగాని శ్రీధర్రావు గారికి ఫస్ట్ క్లాస్. ఢంకామీద దెబ్బకొట్టి చెప్తాను." అంది పద్మ.

శైలజ అర్థంగానట్లు చూసింది.

పద్మనవ్వుతూ "మాయింటిదగ్గర వీళ్లిద్దరూ చదివేవారు. శ్రీధర్రావుగారు రాత్రి రెండు గంటల వరకూ చదువుతుంటుంటే మా అన్నయ్య పది కాకముందే నిద్రపోయే

# జీవితవలయాలు

చాడు. అబ్బ! అప్పుడు శ్రీధర్రావుగారు మా అన్నయ్యని మేల్కొలుపుతుంటే వినాలిరా బాబూ! ప్రక్కగదిలో పడుకున్న నాకు యింతాపుకున్నా నవ్వు ఆగేదికాదు. చివరికి ఆయన మీద విసుక్కుంటూ, నసుక్కుంటూ లేచి పుస్తకాలముందు కూర్చునేవాడు. నిజంగా మా అన్నయ్య యీ సారి పాసయితే అది కేవలం శ్రీధర్రావుగారి ప్రతిభ అనే చెప్పాలి" అంది. అందరూ పద్మతో పాటు నవ్వారుగాని శైలజనవ్వలేకపోయింది. మొదట శ్రీధర్ గూడ అందరితో పాటు నవ్వాడు గాని మధ్యలో భార్య ముఖం చూసేసరికి అతనికేదో జ్ఞాపకంవచ్చి ముఖం గంభీరంగా చేసుకున్నాడు. చాలా సేపు కూర్చున్న తరువాత పద్మలేస్తూ "రేపు నా బర్త్ డే పార్టీ. తప్పకుండా అందరూ రావాలి." అని మరీ మరీ చెప్పి ఒట్టు వేయించుకుని వెళ్ళిపోయింది.

సినిమాలకి, షికార్లకి యిష్టంలేకపోయినా బలవంతాన తిరుగుతున్నట్లు కన్పించాడు శ్రీధర్. మర్నాడు పద్మపుట్టినరోజు. పార్టికి అందరూ బయల్దేరారు. విశేషంగా అలంకరించుకొని సహజ సౌందర్యానికి మెరుగులు దిద్దుకుని మెరిసిపోతున్న శైలజ మీదనుంచి శ్రీధర్ బలవంతాన తన దృష్టి తొలగించుకోవాల్సి వచ్చింది. తన భార్యలో అంత సౌందర్యనిధు లున్నాయని ఇప్పటివరకూ శ్రీధర్కి తెలియదు. పార్టి చాలా ఘనంగా జరిగింది. చాలమంది వచ్చారు. అందరూ శైలజను చూసి, అతని పరీక్షనుగురించి విని "నువ్వు చాలా అదృష్టవంతుడివి శ్రీధర్" అన్నారు.

"ఏం అదృష్టంలే బాబూ! నా అదృష్టం యే నిర్భాగ్యులకు వద్దు" అనుకున్నాడు మనసులో శ్రీధర్. కాని ఆసమయంలో అతని చూపులు మటుకు శైలజను వెతుకుతూనే వున్నాయి.

నాల్గు రోజులుండి తిరిగి వెళ్ళటానికి బయలుదేరుతున్న మహీధర్తో "మీ చెల్లెల్ని గూడా తీసుకువెళ్లు నీతో" అన్నాడు. శ్రీధర్.

"ఆ యెందుకు? మేం వచ్చాంగదా మరోసారి వస్తుంది. ఇప్పుడొద్దులే. పరీక్షలు తెలిసిన తర్వాత యిద్దరూ వద్దురుగాని" అన్నాడు మహీధర్ మరో మాటకవకాశం యివ్వకుండా. శ్రీధర్కి యేం మాట్లాడాలో తోచలేదు. కాసేపటికి 'నాకు తీరుబడి వుండదు' అన్నాడు.

"పోనీ అంతగా చూడాలని వుంటే మేమే వస్తాం" మహీధర్ సంభాషణ ముంచేసి అక్కడనుంచి వెళ్ళిపోయాడు. మొట్టమొదట చెల్లెల్ని బావమరిదిని తనతో పాటు తీసుకెళ్లాలని వచ్చిన మహీధర్ తన అభిప్రాయాన్ని మార్చుకోవటానికి కారణభూతు లెవరో తెలుసుకోవటానికి శ్రీధర్కంతోసేపు పట్టలేదు.

"ఇంతకీ పందెంలో ఎవరు గెల్చారు? నువ్వా మీ అన్నయ్యా" అని అడిగాడు శ్రీధర్ భార్యను జలజావాళ్లు వెళ్ళిపోయిన సాయంత్రం.

"నేనే" అంది శైలజ.

"యెలాగ జలజకూడా బాగా చదివింది కదా. తప్పకుండా పాసవుతుందని చెప్తున్నాడే మరి"

"అయితే సమానమవుతాం" అంది శైలజ వచ్చేనవ్వు ఆపుకుంటూ శ్రీధర్ అర్థం గానట్లు మొహంలోకి చూశాడు.

"పందెం లేదూ పాడులేదు. మా రాజేశ్వరి పెళ్లిలో మిమ్మల్ని చూశాను. మీ అందం మీఠీవి చూస్తే మిమ్మల్ని పెళ్ళిచేసుకోవాలనిపించింది. అమ్మ, నాన్న అందరూ చదువు తక్కువని సందేహించారు. అయినా పట్టుదలపట్టి మిమ్మల్నే చేసుకున్నాను. కాని తర్వాత మా చుట్టాలు, స్నేహితులు నన్ను యెగతాళి చెయ్యటం మొదలుపెట్టారు. వారి యెగతాళే మిమ్మల్ని యింతగా చదివించటానికి కారణమయ్యింది. నేను ఒకసారి యీ విషయమే అన్నయ్యకు వ్రాస్తే మంచిదని సలహాయిస్తూ తనుగూడా జలజచేత పరీక్షకి కట్టించాడు. కాని అన్నయ్య జీవితంలో యేమార్పూ రాలేదు. జలజ వాడిని అర్థం చేసుకుని సహకరించింది. కాని మీరు..." శైలజ కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తల వంచుకుంది.

శ్రీధర్ మొదట తెల్లబోయినా తర్వాత సంబాళించుకుని "మరి యీ విషయం చెప్పకుండా ఆవిధంగా అబద్ధం ఎందుకు కల్పించావు శైలా!" చాల రోజుల తర్వాత అతని కంఠంలో ఆప్యాయత కన్పించింది.

"కేవలం వారి హేళనంటే మీరు పట్టుదలగా చదవరనుకున్నాను. అందుకని ఆ విధంగా చెప్పాను. నన్ను ఈఒక్క విషయంలో క్షమించండి" శైలజ వంగి అతని పాదాలు తాకుతూ అంది. శ్రీధర్ దూరంగా జరిగి "ఆగు ఇవాళ క్షమించమని యింత తేలికగా అడుగుతున్నావు. కాని యిన్ని రోజుల్నుంచి నేనెంత క్షోభించిపోయానో నీకు తెలియదు శైలా' శైలజ మరింత దగ్గరకు వస్తూ

"అవును నాకు తెలుసు" అంది కళ్ళ నీళ్ళలో తన వైపుచూచే శైలజను చూసేసరికి శ్రీధర్ హృదయం కరిగిపోయింది.

"జీవితంలో మరో మారు ఓడిస్తున్నావు కదూ!"

"లేదండి లేదు. మరోసారి ఓడిపోతున్నాను. చిన్న పిల్ల ఆడే చిలిపి ఆటలను చూస్తున్నట్లుగా మీరు ప్రతిది నన్ను క్షమిస్తున్నారు. ఇంక ఈవిధమైన జీవితాన్ని మరి రానివ్వను. నాకు అవకాశం ఇవ్వండి. నాజీవితాన్ని విషాదాంతం చెయ్యబోకండి" శైలజ శ్రీధరుని భుజంమీద వాలి యేడుస్తూ అంది.

"నీజీవితం విషాదాంతం చేస్తానని నువ్వెలా అనుకోగలిగావు శైలా? కఠినమైన నిబంధనలతో నిన్ను నువ్వు బంధించుకున్నావు. నన్ను బంధించావు. అందువలన నేనా అసలు స్వరూపం గుర్తించలేకపోయావు. ఈరోజునుంచి నూతన జీవితం ప్రారంభిద్దాం పద. అమ్మ భోజనానికి మనకోసం యెదురు చూస్తూ వుంటుంది." అన్నాడు శైలజ మొహం తన వైపుకి తిప్పుకుని కళ్ళ నీళ్ళు తుడుస్తూ. అప్పుడే భోజనానికి రమ్మనమని పిలుద్దామని లోపలకు రాబోయిన తల్లి ఆగి వెనక్కి వెళ్ళిపోయింది. ప్రక్కయింటి వారి కొబ్బరి చెట్టు మీద వున్న రెండు పక్షులు యింక మనం చూడకూడదన్నట్లు లేచి యెగిరిపోయినాయి. ఈ రెండు సంగతులు వారికి తెలియవు. ఆవిధంగా వారెంత సేపు వున్నారో కూడా వారికే తెలియదు.

(అయిపోయింది


స్కిన్‌డెక్స్
గజ్జి, దురదలు, పుండ్లు మొ॥
చర్మవ్యాధులకు దివ్యాంజనము
శ్రీవత్స కెమికల్స్ & డ్రగ్స్
లిమిటెడ్, మద్రాసు-30.